www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 22 డిసెంబర్ 2024



జనవరి 29 నుంచి శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

దేవుని కడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 6 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రారంభ రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల మధ్య అంకురార్పణ, 2 ఉదయం 9.30 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 10 గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం ఉంటుంది. రూ.300 చెల్లించి గృహస్థులు (ఇద్దరు) కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. ఫిబ్రవరి 7న సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో రోజూ హరికథలు, భక్తి సంగీత ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సందర్శన కాదు.. స్థిరీకరణ కావాలి


గండికోట నిర్వాసితుల ఎదురుచూపులు

గండికోట, సర్వరాయసాగర్, వామికొండ, పిబిసికి సప్లయ్ ఛానల్లేవీ

నేడు జిల్లాకు నీటిపారుదల శాఖ మంత్రి రాక

రాయలసీమకే తలమానికమైన ప్రాజెక్టు గండికోట, ఇటువంటి ప్రాజెక్టును సందర్శించడంతో సరిపెట్టడం కాదు.. స్థిరీకరణ పనులకు అవసరమైన నిధులు కేటాయించాలి. అనుబంధ రిజర్వాయర్లకు సంబంధించిన సప్లయ్‌ఛానళ్లు, ఉప కాల్వల నిర్మాణ పనులపై దృష్టి సారించాలి. జిల్లాలోని సర్వరాయసాగర్, వామికొండ, సిబిఆర్, పిబిసి, మైలవరం, వెలిగల్లు, ఝరికోన, అన్నమయ్య ప్రాజెక్టుల సప్లయ్ ఛానళ్ల పరిస్థితి అయోమయంగా మారింది. గండికోట, సోలార్ నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో మీనమేషాలు లెక్కిస్తోంది. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో కథనం...

పెండింగ్‌లో ఉన్న జిఎన్ఎస్ఎస్ టన్నెల్ పనులు



ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లా సాగునీటిపారుదల రంగానికి బడ్జెట్‌లో రూ.3,848 కోట్లు కేటాయించారు. జిఎన్‌ఎస్‌ఎస్‌కు రూ.2,254 కోట్లు కేటాయించారు. మూడు నెలల వ్యవధిలో నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకూ పైగా ఖర్చు చేసిన దాఖలాల్లేవు. గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం చెల్లింపు ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత వైసిపి సర్కారు హయాంలో చేపట్టిన ప్రాజెక్టు పనులపైన శూలశోధన చేయడం తప్పా, నిర్మాణాత్మక పురోగతి సాధిద్దామనే ఆలోచన కొరవడింది. జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనులు పూర్తి చేస్తే 2.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. చిత్తూరు జిల్లాలో 1.5 లక్షల ఎకరాలు, కడప జిల్లాలో 1.2 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 1,150 ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుంది. ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుకు ఫారెస్టు క్లియరెన్స్ సమస్య పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఫేజ్-1లోని కీలకమైన అవుకు టన్నెల్ పనులు ఎంతో వ్యయప్రయాసల మధ్య పూర్తి చేసింది. మిగిలిన టన్నెల్ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

అవుకు టన్నెళ్లకు పూర్తి చేయక పోవడం వల్ల కృష్ణాజలాల వాటాకు కోత పడుతోంది. ఫలితంగా కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన సుమారు 2.5 లక్షల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. సర్వరాయసాగర్ డిస్ట్రిబ్యూటరీలు, సాగుకాల్వల నిర్మాణానికి రూ.40 కోట్ల నిధులు అవసరమని తెలుస్తోంది. వామికొండ రిజర్వాయర్‌కు రూ.15 కోట్ల వ్యయంతో ఉపకాల్వలను ఏర్పాటు చేయాల్సి ఉంది. పిబిసి పైపులైన్ డిస్ట్రిబ్యూటరీలు, పెద్దకాలువలు, అనుబంధ కాల్వలకు 74 వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. జికెఎల్‌ఐ డిస్ట్రిబ్యూటరీస్ కింద 20 వేల ఎకరాలు, జికెఎల్ఐ 20 వేల ఎకరాలు, సిబిఆర్ కింద 20 వేల ఎకరాలు, సిబిఆర్ పథకం, పిబిసి కింద 18 ఎత్తిపోతల పథకాల పనులు నత్తనడకన సాగుతున్న విషయం తెలిసిందే.



అన్నమయ్య ప్రాజెక్టు (ఫైల్‌ఫొటో)

ఏడు ఎత్తిపోతల పథకాల ద్వారా 59,500 ఎకరాల ఆయకట్టుకు నీరం దించాల్సి ఉంది. గ్రావిటీ ద్వారా 24 వేల ఎకరాలకు నీటి సదుపాయం ఉంది. పుల్లారెడ్డిపల్లి ప్రాంతం నుంచి ఏడు ఎత్తిపోతల పథకాల పనుల్ని పూర్తి చేసింది. ఏడు నుంచి ఐదు ఎత్తిపోతల పథకాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలుస్తోంది. మరో ఆరు ఎత్తిపోతల ప్రారంభ దశను దాటడం లేదని తెలుస్తోంది. వెలిగల్లు, ఝరికోన, అన్నమయ్య, బ్రహ్మసాగర్ ప్రాజెక్టుల్లో నీటి విడుదలకు నోచుకోని గ్రామాలు ఉన్నాయని తెలుస్తోంది. మైలవరం తాత్కాలిక మరమ్మతులకు రూ.50 లక్షలు కేటాయించింది. ఉత్తర, దక్షిణ కాల్వల ఆధునీకరణ కింద రూ.150 కోట్లకుపైగా కేటాయించాల్సి ఉంది. మైలవరం స్థిరీకరణ ప్రశ్నార్థకంగా మారింది. బ్రహ్మసాగర్ రిజర్వాయర్ కింద 1.77 లక్షల ఎకరాలకు గాను 1.27 వేల ఎకరాలకు మాత్రమే నీటి సదుపాయం ఉంది. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ; ఎప్పుడు తెలియడం లేదు. గండికోట ఎత్తిపోతల పథకంలో భాగమైన పిబిసికి, సప్లయ్ ఛానళ్లు లేకపోవడంతో 41 వేల ఎకరాలు, సర్వరాయసాగర్, వామికొండ కింద 24 వేల ఎకరాలు, వెలిగల్లు కింద 24 వేల ఎకరాలు, బ్రహ్మసాగర్ కింద 50 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ప్రశ్నార్థకంగా మారింది.

జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా మహాసభలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సిపిఎం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ తెలిపారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా సమగ్ర అభివృద్ధి సాధనే లక్ష్యంగా 2025, జనవరి 4 ,5 తేదీల్లో సిపిఎం 12వ జిల్లా మహాసభలు నగరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3 సంవత్సరాల ఉద్యమ సమీక్ష చేసుకుని, భవిష్యత్తు ఉద్యమ ప్రణాళిక ఈ మహాసభల్లో సిపిఎం కార్యకర్తలు, నాయకులు కర్తవ్యా రూపకల్పన చేసుకుంటారని పేర్కొన్నారు. జిల్లా మహాసభల మొదటి రోజైన 2025, జనవరి 4న ఉదయం 10 గంటల నుంచి కడప నగరం నడి ఒడ్డున ఉన్న జియస్ కాలేజీ నుంచి నగర పురవీధుల్లో ఎర్రజెండాల కవాతుతో 'మహా ప్రదర్శన' అనంతరం భారీ బహిరంగ సభ ఐటిఐ సర్కిల్ గాంధీ పార్క్ ఉంటుందని చెప్పారు. జిల్లాలోని 36 మండలాలు, 7 నియోజకవర్గాలలో ప్రాజెక్టులు, పరిశ్రమలు, వ్యవసాయ అభివృద్ధి, వ్యవసాయ కూలీల వలసల సమస్యలపై, కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యచరణను ఈ మహాసభల్లో రెండవ రోజు జనవరి 5న ప్రతినిధుల సభ మేధో మదనం చేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐ.ఎన్.సుబ్బమ్మ, ఎ.రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులురెడ్డి, బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

కెసి ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌గా గురివిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌గా మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి గురివిరెడ్డి ఎన్నికయ్యారు. శనివారం నంద్యాలలోని కెసి కెనాల్ కార్యాలయంలో ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహించారు. కడప, కర్నూలు జిల్లాలోని డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌లు ప్రాజెక్టు చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఎన్నుకున్నారు. చైర్మెన్‌గా కర్నూలు జిల్లాకు చెందిన బుడ్డా రామలింగారెడ్డిని, వైస్ చైర్మన్‌గా గురివిరెడ్డిని సభ్యులు ఎన్నుకున్నారు. వైస్‌చైర్మన్‌గా గురివిరెడ్డి ఎన్నికైన సందర్భంగా చాపాడు మండల టిడిపి నాయకులు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వైవి సుబ్బారెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మేకల బాబు, టిడిపి నాయకులు వీరశేఖర్ రెడ్డి, అంకిరెడ్డిపల్లి మురళీమోహన్‌రెడ్డి, దువ్వూరు టిడిపి మండల శాఖ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, ఖాజీపేట మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, కెసి డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ రవీంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్స్ కమిటీ చైర్మన్‌గా జోగిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక

సింహాద్రిపురం : కడప, కర్నూల్, అనంతపురం జిల్లాల పరిధిలోని హెచ్ఎల్‌సి ప్రాజెక్ట్స్ కమిటీ చైర్మెన్‌గా పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి సోదరుడు జోగిరెడ్డి ఏకగ్రీవ ఎన్నికయ్యారు. శనివారం అనంతపురంలోని హెచ్‌ఎల్‌సి కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలలో మండలంలోని కసునూరు డిస్ట్రిబ్యూటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జోగిరెడ్డిని ప్రాజెక్ట్స్ కమిటీ చైర్మన్‌గాఎన్నుకున్నారు. ఆయన్ను కడప జిల్లాలోని ఆరుగురు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్లు, అనంతపురం జిల్లాలోని ఐదుగురు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్లు, కర్నూలు జిల్లాలోని ఆలూరు బ్రాంచ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జోగి రెడ్డి మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు. కాలువలను ఆధునీకరణ చేసి చివరి ఆయకట్టుకు సాగునీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు.



సింహాద్రిపురం : జోగిరెడ్డిని అభినందిస్తున్న నాయకులు

గౌరవ వేతనం కొనసాగింపు హర్షణీయం

ప్రజాశక్తి - బద్వేలు

మసీదు ఇమామ్, మౌజన్‌లకు అందచేస్తున్న గౌరవ వేతనాలను కొనసాగిస్తూ ప్రభుత్వం జిఒ జారీచేయడం హర్షణీయమని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్‌బాషా హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలను కొనసాగిస్తూ జీవో జారీచేయడం హర్షణీయమన్నారు. చంద్రబాబు నాయుడు ముస్లిముల పక్షపాతి అని, ఇమామ్, మౌజన్‌లకు దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో మొట్ట మొదటి సారి వేతనాలను అందచేసిన ఘనత టిడిపి ప్రభుత్వానికి మాత్రమే దక్కిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ముస్లిములకు అన్యాయం చోటు చేసుకుందని తెలిపారు. దుల్హన్, తోఫా, మైనార్టీ కార్పొరేషన్ రుణాలు తదితర పథకాలు అటకెక్కాయన్నారు. చంద్రన్న హయాంలో ముస్లిములు తిరిగి అభివృద్ధి పథానా పయనిస్తారని ఆయన ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిరిగిరిపల్లె ముస్తఫా, మహబూబ్ బాషా, రఫి, మహ్మద్ రఫీ, సత్తార్, రసూల్ పాల్గొన్నారు.

అధికారుల నిర్ణయాలతో ప్రభుత్వానికి నష్టం

ప్రజాశక్తి - కడప అర్బన్

కొంత మంది ఆర్‌టిసి అధికారుల నిర్ణయాలు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నాయని ఎపి పిడిటి (ఆర్‌టిసి) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యదర్శి ఎ. రామూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెన్షన్ కొరకు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు మంజూరుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. 2019లో సాధించుకున్న సర్క్యులర్ 01/2019ను గత ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు జిల్లాలలోని ఆర్‌టిసి అధికారులు పక్కన పెట్టారని చెప్పారు. ఆ సర్క్యులర్ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్‌టిసి ఎమ్‌డి జోక్యం వల్ల గత నెల 29న విజయవాడలో ఆర్‌టిసి హౌస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉన్నతాధికారుల సమావేశంలో సర్క్యులర్‌ను యథాతదంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కొంతమంది కిందిస్థాయి అధికారులు ఈ సర్క్యులర్ అమలు చేయకుండా అక్రమంగా ఛార్జిషీట్ ఇస్తూ, డ్యామేజ్ కాస్ట్‌లను రికవరీలు చేస్తూ, సస్పెండ్లు, రిమూవల్స్ చేస్తూ సమస్యలు సృష్టించడం దారుణమన్నారు. ఇలాంటి అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కడప జిల్లా కార్యదర్శి ఎ.రామూర్తి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సి.ఆనందబాబు, ఇ.యు కడప జిల్లా గౌరవ అధ్యక్షులు యల్.నాగసుబ్బారెడ్డి, కడప నాన్ ఆఫరేషన్ రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.రామాంజనేయులు, యస్.అంకిరెడ్డి, ఇ.యు నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

బరితెగింపు

ప్రజాదృష్టి

ఉమ్మడి జిల్లాలో ఇసుకాసురుల బరితెగింపు కొనసాగుతోంది. రాజంపేట నియోజకవర్గం నందలూరు మండలం టంగుటూరు ఇసుక రేవు నుంచి రాత్రింభవళ్లు యథేచ్ఛగా ఇసుక తరలింపు సాగిపోతోంది. ఉమ్మడి జిల్లాలోని జమ్మలమడుగు, కమలాపురం, రాజంపేట, ప్రొద్దుటూరు నియోజకవర్గ కేంద్రాలుగా ఇసుకాసురుల చెలరేగిపోతున్నారు. వీరి ఆగడాలకు అడ్డుకట్ట పడనిదే భూగర్భశోకం తీరదు. ఇసుకాసురుల ఆగడాల వెనుక అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఉన్నారు. గతేడాది జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలంలోని ఓ ఇసుక క్వారీ నుంచి మైనింగ్ నిబంధనలను బేఖాతర్ చేస్తూ సుమారు 10 నుంచి 12 మీటర్ల వరకు గుంతలు తవ్వి ఇసుకను కొల్లగొడుతుండడం దోపిడీకి పరాకాష్ఠగా చెప్పుకోవచ్చు. జిల్లాలో నిత్యం అక్రమ రవాణా సాగిపోతోంది. రాష్ట్రంలో ఎవరు అధికారం చేపట్టినా ప్రకృతి వనరులను చెరపట్టి కొల్లగొట్టి భారీగా సొమ్ము చేసుకునే యజ్ఞం పదేళ్లుగా సాగిపోతోంది. ఇసుక, మట్టి, ఎర్రచందనం, భూకబ్జాలను వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. రెండేళ్ల కిందట జిల్లా పరిషత్ కార్యాలయంలో నీటి వనరులపై రచించిన పుస్తకావిష్కరణ సభలో ఓ రిటైర్డు జస్టిస్ ఇసుకను కొల్లగొట్టడం వల్ల నీటి వనరుల లభ్యతపై పెనుప్రభావం పడుతుందని పట్ల ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. మేధావులు, బుద్ధిజీవుల నుంచి హెచ్చరికలు, ఆందోళనలు వినిపిస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం ఆందోళనకరం. ఆకులు కాలిన తర్వాత చేతులు పట్టుకున్నా ఉపయోగం ఉండదనే హితవు చెవికి ఎక్కడం లేదు. అంతులేని ధన దోపిడీకి కళ్లెం వేయాల్సిన తరుణం ఆసన్నమైందని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలోని మేధావులు, బుద్ధిజీవులు, విద్యావంతుల్లో చలనం రావాల్సిన అవసరం ఉంది. ఉత్తముల మౌనం వల్ల సమాజానికి తీవ్ర హాని జరుగుతుందనే అంశాన్ని గ్రహించాల్సిన అవసరం ఏర్పడింది. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల దోపిడీకి హద్దు పద్దూ లేకుండా పోతుంది. ప్రజాప్రతినిధులు, అనుచరుల రూపంలో ఇసుకాసురులు ఉండడం వల్ల జిల్లాకు చెందిన అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వమే ప్రకృతి వనరులకు వాటిల్లుతున్న హానిపై స్పందించాల్సిన అవసరం ఉరుముతోంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపిలోకి వెళ్లే ప్రసక్తే లేదు : కార్పొరేటర్లు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప అభివృద్ధి కోసం వైసిపి నుంచి టిడిపిలోకి మారామని, మరో మారు మరో పార్టీ మారాల్సి వస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటామే తప్ప, తిరిగి వైసిపిలోకి వెళ్లే ప్రసక్తే లేదని, టిడిపిలోకి వచ్చిన కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, సూర్యనారాయణ చెప్పారు. శనివారం ద్వారకా నగర్ లోని ఎమ్మెల్యే మాధవి స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైతిక విలువలు ఉంటే రాజీనామాలు చేయాలని, పార్టీ మారినందుకు వైసిపి నాయకులు అవినీతి ఆరోపణలు చేయడం హాస్యాస్పందంగా ఉందన్నారు. నగరపాలక సంస్థ సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే కూర్చోవడానికి సీటు ఇచ్చి, తర్వాత జరిగిన సమావేశంలో ఆమెను అవమాన పరచడం అందరికీ తెలిసిందే అన్నారు. కడప అభివృద్ధి చెందాలని ప్రజలు మాధవిని ఎమ్మెల్యే సీటులో కూర్చోబెట్టారని, మీరు ఇవ్వడానికి ఏముందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరామని, గంటపాటు కడప అభివృద్ధి గురించి ఆయనతో మాట్లాడితే, అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తమకు మాట ఇచ్చారని చెప్పారు. పార్టీ మారితే ఓట్లు వేసిన ప్రజలే మమ్మల్ని ఎందుకు పార్టీ మారారని అడగనప్పుడు, వైసిపి నాయకులకు ఎందుకని నిలదీశారు. సమావేశంలో కార్పొరేటర్లు జప్పుల్ల, సిలాస్, నాయకులు బాలకృష్ణారెడ్డి, చల్లా రాజశేఖర్, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కడప :

రెండు రోజుల కిందట 43వ డివిజన్ రవీంద్ర నగర్‌లోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటనలో సామగ్రి కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్ 43వ డివిజన్ ఇన్‌ఛార్జి దినకర్‌రెడ్డితో కలిసి శనివారం మధ్యాహ్నం బాధిత కుటుంబం ఇంటికి వెళ్ల ఆర్థిక సాయం అందజేశారు. నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో 41 డివిజన్ ప్రెసిడెంట్ అమీద్, 40 డివిజన్ ప్రెసిడెంట్ జహూర్, 44 డివిజన్ ప్రెసిడెంట్ రంతుల్లా ఖాన్, 45 డివిజన్ ప్రెసిడెంట్ శ్యామలమ్మ, కాంగ్రెస్ మహిళా నాయకులు సంధ్య , నాగరత్నమ్మ పాల్గొన్నారు.

సాధన చేస్తే గణితం సులువు

ప్రజాశక్తి - కడప అర్బన్ : సాధన చేస్తే గణితం ఎంతో సులువు అని పాత కడప జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.విశ్వభారతి అన్నారు. శనివారం పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎగ్జిబిషన్‌ను హెచ్‌ఎం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయులు కె.వి. నాగరాజు, పి.వెంకట సుబ్బయ్య, ఆర్. ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గణిత ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. గణితంలో వందకు వంద మార్కులు సాధించే అవకాశం సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. సాధనతోనే విద్య సాధ్యమవుతుందని చెప్పారు. గణిత ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప :

ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హాస్పిటల్ కడప యాజమాన్యం సెక్రటరీ జవాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ఆధ్వర్యంలో శనివారం చెన్నూరు మండల ప్రాథమిక పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, ఇఎన్‌టి, డెంటల్, చర్మ వ్యాధులు, కంటి సమస్యలకు సంబంధించిన వైద్య సేవలు గ్రామ ప్రజలకు ఉచితంగా అందించారు. ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 150 మందికి పైగా దౌలతాపురం గ్రామస్తులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హాస్పిటల్ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

రూట్ కెనాల్‌పై మెలకువలు తప్పనిసరి

ప్రజాశక్తి - కడప



డెంటల్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు

దంత వైద్య విద్యార్థులు రూట్ కెనాల్ వైద్యంపై మెలకువలు పెంపొందించుకోవాలని డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాల కన్జర్వేటర్, ఎండో డెన్టస్టి విభాగంలో శనివారం ఎన్టీఆర్ యూనివర్సిటీ రాయలసీమ జోన్‌కు సంబంధించిన కంటిన్యూయస్ డెంటల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. అథితి ఉపన్యాసకులుగా విచ్చేసిన డాక్టర్ వేణుగోపాల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ దంత విద్యార్థులకు రూట్ కెనాల్ ట్రీట్మెంట్‌పై అవగాహనతో పాటు మెలకువలను మైక్రోస్కోప్ ద్వారా బోధించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. జ్యోత్స్న, డాక్టర్ రామ్మోహన్, హెచ్‌డిఒ డాక్టర్ పి. సత్యనారాయణ, అధ్యాపకులు డాక్టర్ దుర్గాభవాని, డాక్టర్ సుందర్, డాక్టర్ తేజశ్రీ, డాక్టర్ పవన్, డాక్టర్ తిరుపతి పాల్గొన్నారు.

'మా భూమిని ఇప్పించి న్యాయం చేయండి'

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె: 'మా భూమి ఇప్పించి న్యాయం చేయండి సారూ..' అంటూ ఊటుకూరుకు చెందిన గుర్రాల లక్ష్మిదేవి అధికారులను వేడుకున్నారు. శనివారం ఊటుకూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ నాగేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఊటుకూరు రె వెన్యూ పొలంలోని సర్వే నెంబర్ 182/3-64 సెంట్ల భూమి ఉందని, కడప నగర కార్పొరేషన్‌లో ఓ కార్పొరేటర్, అతని అనుచరులు కలిసి పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాది అప్పటి సిఐ తనను, తనభర్తను, కుమారుడిని రివాల్వర్ తీసి బెదిరించారన్నారు. కార్పొరేషన్ ద్వితీయశ్రేణి నాయకుడు, వారి అను చరులపేరుతో 64 సెంట్ల స్థలాన్ని తమ వద్ద కొనుగోలు చేసినట్లు రెవెన్యూ స్టాంపులపై సంతకాలు చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం ఎక్కడైనా చెబితే కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించి భూమిని అక్రమంగా రాయించుకున్నారని ఆమె వాపోయారు. ఇప్పటికైనా తమ భూమి ఇప్పించి న్యాయం చేయాల్సిందిగా కోరారు.

కానిస్టేబుళ్ల పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కానిస్టేబుల్ అభ్యర్థుల శారీరక సామర్థ్య పరీక్షల కోసం సిద్ధం చేస్తున్న ఏర్పాట్లను ఇన్‌ఛార్జి వి. విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు. శనివారం దేహ ధారుఢ్య పరీక్షలు నిర్వహించే జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం(డిటిసి) మైదాన్ని సందర్శించారు. మైదానంలో చేపట్టాల్సిన పనుల పై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన ఉమ్మడి కడప జిల్లా అభ్యర్థులకు ఈనెల 30 నుంచి 2025 ఫిబ్రవరి 01 వరకు దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలు ఉంటాయని తెలిపారు.

పీస్ ఇస్లామిక్ స్కూల్లో ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - కడప అర్బన్ :



తినుబండారాలను పరిశీలిస్తున్న ఎంఇఒ

పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం ఘనంగా విద్యార్థులు ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. రకరకాల తిను బండారాలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా కడప ఎంఇఒ గంగిరెడ్డి విచ్చేశారు. పలు రకాల వంటలను పరిశీలించి, రుచి చూశారు. వీరితో పాటు స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ గౌస్ పీర్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పిల్లలు చాలా చక్కగా, రుచికరంగా వంటలు చేశారని అభినందించారు. చదువులతో పాటు ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల పిల్లలలో వంటల పట్ల కూడా ఒక అవగాహన వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమం చేపట్టిన యాజమాన్యాన్ని అభినందించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కడప : జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సెమీ-క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెం విజయ భాస్కర్ అధ్యక్షతన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్‌ను ముఖ్య అతిథులు గా హాజరైన పిసిసి ప్రధాన అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్. డి. విజయ జ్యోతి, పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీ ఖాన్, కడప అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ బండి జకరయ్య, కాంగ్రెస్ నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో బిషప్లు, పాస్టర్లు, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ సలావుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, చిన్న కుల్లాయప్ప, శ్యామలమ్మ, గంగాధర్, సంజయ్ కాంత, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప అర్బన్ : శనివారం రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న ఆరోగ్యమాత చర్చిలో ఆమూరి బాలదాసు ఆధ్వ ర్యంలో సమైక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈవేడుకల్లో చర్చ్ డైరెక్టర్, ఫాదర్లు ప్రసాదరావు, మహేష్ క్రిస్మస్ ప్రాధాన్యతను గూర్చి తెలిపారు. కార్యక్రమంలో వి.ఎస్. అమీర్ బాబు, ఆలంఖాన్ పల్లి లక్ష్మిరెడ్డి, శివకొండారెడ్డి, సలావుద్దీన్, అబ్దుల్లా బాయ్ పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు వేదిక వైవీయూ

ప్రజాశక్తి - కడప అర్బన్

కన్నవారి ఆకాంక్షలను నెరవేర్చి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకునేందుకు విద్యార్థులకు యోగి వేమన విశ్వవిద్యాలయం చక్కటి జ్ఞాన కేంద్రం అని విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. యోగివేమన విశ్వ విద్యాలయంలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమం శనివారం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అతిథులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన విసి మాట్లాడుతూ విద్య కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చుచేస్తోందని మీరు ప్రయోజకులై సమాజ అభివృద్ధి కృషి చేయాలన్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన ఫ్యాకల్టీ, విలువైన పుస్తకనిధి కలిగిన లైబ్రరీ ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశిష్ట అతిథులుగా రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ దేశంలోని అత్యున్నత విశ్వ విద్యాలయంల్లో వైవీయూ ఒకటన్నారు. వైవీయూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అద్భుతమైన వేదికన్నారు. మీ ఉజ్వల భవిష్యత్తుకు, తల్లిదండ్రుల ఆకాంక్ష లు నెరవేరాలంటే విద్య ఏకైక మార్గమన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో లభించే వనరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీ లక్ష్యసాధనలో విశ్వవిద్యాలయం వెన్నంటి ఉంటుందన్నారు. గొప్ప స్థాయిల్లో ఉన్నవారంతా రోజుకు 18 గంటలు శ్రమించిన వారేనని గుర్తుచేస్తూ వారిని అను సరించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలపై సమీక్ష

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం ఊటుకూరులో ఎఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సునీల్ కుమార్ అధ్యక్షతన పంటలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్ఆర్ జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర రావు, అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్, కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్రం కో- ఆర్డినేటర్ డాక్టర్ అంకయ్య కుమార్, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం శాస్త్రవేత్తలతో వివిధ పంటలైన శనగ, మినుము, ఉలవ, వరి, వేరుశనగ, బొప్పాయి, మామిడి, అరటిని ఆశించే చీడపీడల నివారణ చర్యలపై డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ .మాధురి, డాక్టర్ ఎస్. మానస, డాక్టర్ పీరు సాహెబ్‌లతో చర్చించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ డివిజన్ల అధికారులుపాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలించిన డిపిఒ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని స్థానిక బుగ్గలపల్లె పంచాయతీలో చేపట్టిన పారిశుధ్య పనులను డిపిఒ రాజ్యలక్ష్మి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ఈనెల 26, 27 తేదీల్లో పర్యటనల భాగంగా మండల పరిధిలోని బుగ్గలపల్లె పంచాయతీని సందర్శిస్తారని, పరిసరాలు శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. అక్కడ జరుగుతున్న శానిటేషన్, క్లీనింగ్ పనులను పరిశీలించి సిబ్బందికి తగు సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి కారి కుళాయి బాబు, విస్తరణ అధికారి టి.వి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దాడులు చేస్తే న్యాయపోరాటం చేస్తాం

ప్రజాశక్తి - కడప : పాస్టర్లపై దాడులు చేస్తే న్యాయ పోరాటం చేస్తామని రెవరెండ్ కె.లాజర్, పాస్టర్ల సంఘం నాయకులు హెచ్చరించారు. కడప నగరం కృపా కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సుకు ముఖ్య అతిథులుగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులు హింసలు ఎదుర్కోవడం కొత్తేమి కాదని పేర్కొన్నారు. సిఆర్‌పిఎఫ్ రాష్ట్ర నాయకులు డాక్టర్ రెవరెండ్ శేషం ప్రసాద్, యుపిఎ అసోసియేషన్ అధ్యక్షులు పి.శ్రీనివాసులు వీరు మాట్లాడుతూ ఇక్కడి పాస్టర్ మహేష్ ఎదుగుదలను చూసి ఓర్వలేని తనంతో దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.ఆనంద్, రాష్ట్ర సిఆర్‌పిఎఫ్ ప్రతినిధులు డి.వి ప్రసాద్, మోషే, మానవ హక్కుల సంఘ ప్రతినిధి పి.రవితేజ పలువురు విశ్వాసులు, సంఘ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి -ఎర్రగుంట్ల

మండలంలోని చిలమకూరు యానాది కాలనీలో సర్వే చేసి, హద్దులు చూపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం చిలమకూరు గ్రామ రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహశీల్దార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ యానాదుల కాలనీ ఏర్పడి 40ఏళ్లయిందన్నారు. కాలనీ పక్కన చుక్కల భూములను తప్పుడు పద్ధతిలో అక్రమంగా పెత్తందార్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని, యానాది కాలనీ కూడా తమదేనని స్థానికులను బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. సర్వే నెంబర్ 700-2బి2 చెప్పిన ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులు ఎలాంటి సంబంధం లేకపోయినా కోర్టులో కేసు వేశారు. 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో యానాదులు పక్కాగృహాలు నిర్మించుకున్నారని తెలిపారు. ఆ ఇళ్లకు మరుగుదొడ్లు కట్టుకొని వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. 20 మంది బేస్ మట్టాలు వేసుకున్నారన్నారు. ఇల్లు కట్టుకోకుండా దౌర్జన్యంగా నిలిపివేశారని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం 12 ఏళ్ల సాగులో ఉన్న చుక్కల భూమిని మాత్రమే అధికారులు లబ్ధిదారులకు ఇవ్వవచ్చని అన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో యానాది కాలనీ వా సులు సుబ్బరాయుడు, తిరుమలయ్య, వెంకటేష్, సరస్వతి, గుర్రమ్మ పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రిని కూల్చే ఉద్దేశం మానుకోవాలి

బ్రహ్మంగారిమఠం : దేవస్థానం ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్‌ను దేవస్థానం అధికారులు కూల్చే ఆలోచన చేస్తున్నారనే చర్చ ప్రజల్లో జరుగుతున్న నేపథ్యంలో సిపిఎం మండల కమిటీ శనివారం హాస్పిటల్ ప్రాంతంలో పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ మాట్లాడుతూ 1965 నుంచి నేటి వరకు అనేక ఇబ్బందుల నేపథ్యంలో కూడా హాస్పిటల్ ప్రజల సేవలకు ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. గతంలో బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాల సందర్భంలో యాత్రికులకు వైద్య సేవలకు ఉపయోగపడిందని గుర్తు చేశారు. వైద్యులు కఠిన దక్షత అందుబాటులో ఉన్నప్పుడు పెద్ద సంఖ్యలో వైద్యం కోసం ప్రజలు వచ్చేవారని అన్నారు. బయటి నియోజకవర్గాల నుండి సైతం రోగులు వచ్చిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. దాదాపు రూ.2లక్షలు వెచ్చించి హాస్పిటల్ లోపలి భాగం పునర్నిర్మాణం చేశారని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేద హాస్పిటల్ కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, జనవరి 2నుంచి పూర్తి స్థాయిలో వైద్యాధికారి అందుబాటులోకి రానున్న నేపథ్యంలో దేవస్థానం అధికారులు ఆయుర్వేద హాస్పిటల్ కూడా తొలగించబోతున్నారని చర్చ ప్రజల్లో ఉందన్నారు. ఆ ఆలోచన ఉంటే మానుకోవాలని ఆయన కోరారు. సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్, మండల కమిటీ సభ్యులు హరి, అజయ్, నాయకులు రాహుల్, ప్రదీప్ పాల్గొన్నారు.

పాఠాలు చెప్పకపోతే చర్యలు తప్పవు : డిఇఒ


వేంపల్లె బాలికల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డిఇఒ మీనాక్షి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పకపోతే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని డిఇఒ మీనాక్షి హెచ్చరించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. విద్యా బోధనపై ఆరా తీశారు. ఉపాధ్యాయులకు పాఠ్యాంశాలపై సూచనలు చేశారు. విద్యార్థులకు టైం టేబుల్ వారీగా సబ్జెక్టులను బోధించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు టైం టేబుల్‌ను వేశామన్నారు. బాలికల పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు చెప్పే వారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. మంచితనంగానే పని చేయించుకోవాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ చేస్తున్నట్లు డిఇఒ పేర్కొన్నారు. పాఠశాలను కూడా ఉపాధ్యాయులు కుటుంబంలా భావించి, విద్యార్థులకు మంచి విద్యను అందించాలని కోరారు. పాఠాల హెచ్‌ఎంపై ఇచ్చిన ఫిర్యాదుల కూడా విచారించి, ఆర్‌జెడికి నివేదిక పంపిస్తామన్నారు. ఆయుధ మంది ఉపాధ్యాయులు ఉండి కూడా విద్యార్థులకు పాఠాలు చెప్పకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. విద్యార్థుల క్షేమం కోరే ఉపాధ్యాయులకు టైం టేబుల్ వేస్తున్నట్లు చెప్పారు. అనంతరం హెచ్‌ఎం నారాయణమ్మకు డిఇఒ తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ స్టాలిన్ ఐజాక్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి

- జిల్లా ఎన్నికల రోల్ పర్యవేక్షణాధికారి కన్నబాబు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలని జిల్లా ఎన్నికల రోల్ పర్యవేక్షణ అధికారి కన్నబాబు తెలిపారు. జమ్మలమడుగు పట్టణంలోని ఆనిబిసెంట్ నిమోజకవర్గంలోని 131-బిసి కాలనీ పోలింగ్ కేంద్రం, 87- దానవులపాడు పోలింగ్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించి ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులకుగాను 2024 అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు స్వీకరించిన క్లెయిమ్‌లను సమీక్షించామన్నారు. తొలగింపులు (చనిపోయిన, గ్రామంలో నివాసం లేనివారు) క్లెయిమ్‌లకు సంబంధించి అభ్యంతరాలు, అభ్యంతరాలను పారదర్శకత, న్యాయా పరిష్కారం కోసం వారి ఆడ్రస్‌లకు నోటీసులు జారీ చేశామన్నారు. సరైన ప్రక్రియలను అనుసరించి ప్రాసెస్ చేయాలని అధికారులకు సూచించారు. 18-19 ఏళ్లగల ఓటర్లకు సంబంధించి క్లెయిమ్‌ల నిర్దేశిత ప్రక్రియ ప్రకారం ఆమోదం పొందాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ, తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి, జమ్మలమడుగు ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ శివప్రసాద్, జమ్మలమడుగు ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ ముద్రా వివేకానందరెడ్డి, ఆర్ఐ సతీష్ పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న పర్యవేక్షణాధికారి కన్నబాబు


బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్న గొల్లపల్లె వాసులు

మా గోడు ఆలకించండి మహాప్రభో..!

- బ్రిడ్జి కోసం గొల్లపల్లి గ్రామస్తుల ఎదురుచూపు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీలోని గొల్లపల్లి ప్రజలు వ్యవసాయం, పశువులపై ఆధారపడి తమ జీవనం సాగిస్తుంటారు. బ్రహ్మంసాగర్ కుడి కాలువ తమ గ్రామ సమీపం నుంచి వెళుతుంది. కాలువకు అటువైపు కొండ ప్రాంతం బీడు భూములున్నాయి. పశువులు మేతకు వెళ్లేందుకు కాలువ దాటుకోవాలి. ఈ నేపథ్యంలో కుడి కాలువకు నీళ్లు వదిలినప్పుడు దాదాపు రెండు కిలోమీటర్ల మేర సోమిరెడ్డి పల్లె, వడ్డెను బావి చుట్టి వెళ్లవలసిన పరిస్థితి. సమస్య పరిష్కారానికి కాలువకు బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని గతంలో అధికారులు చెప్పారని, ఇప్పటివరకు అది జరగలేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఈ కాలువలో పలుసార్లు గొర్రెలు కొట్టుకువెళ్లినట్లు తెలిపారు. తమ గోడు ఆలకించి కుడికాలువకు బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


గణిత ప్రాజెక్టు నమూనాలను పరిశీలిస్తున్న స్వాతి శ్రీకాంత్

బీరం పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్య అతిథిగా గ్రూప్ వన్ అధికారి బీరం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదిన కార్యక్రమాన్ని గణిత దినోత్సవంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. గణిత శాస్త్రంపై పరిశోధనలు చేసి కొత్త సిద్ధాంతాలు కనిపెట్టినందుకు ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ గౌరవం ఆయనకు మాత్రమే దక్కిందన్నారు. అనంతరం బీరం విద్యాసంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ గణిత శాస్త్రం అన్ని శాస్త్రాలకు తల్లి వంటిదని, గణిత శాస్త్రం లేకుండా ఈనాడు ప్రపంచం ఏ రంగంలో ముందంజ వేయలేదన్నారు. బీరం విద్యాసంస్థల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్ మాట్లాడుతూ మ్యాథ్స్ అనేది మనిషికి గుండె లాంటిదని తెలిపారు. బీరం పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమ్‌చందర్, పిఇటిలు, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : స్థానిక టికెఆర్ జీవనజ్యోతి విద్యాసంస్థలో శనివారం శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ముందస్తు గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిసి గురుశేఖర్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులచే గణితంలో అనేక రకాల యాక్టివిటీస్ చేయించి, వారిలో ఉన్న ప్రతిభను బయటకు తీశామన్నారు. రామానుజన్ గురించి విద్యార్థులకు వివరించారు. జీవనజ్యోతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు జయదేవ్ రామిరెడ్డి, కరస్పాండెంట్ అమర్నాథ్ రెడ్డి ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.

లింగాల : పోటీ ప్రపంచంలో రాణించేలా ఎప్పటికీ తమ ఆలోచనలను అందిపుచ్చుకోవాలని జిల్లా పరిషత్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ తెలిపారు. వెలిదండ్ల మహాత్మాగాంధీ పాఠశాలలో గణిత శాస్త్రవేత్త రామనుంజన్ జయంతిని పురస్కరించుకుని శనివారం ప్రతిభ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వెలిదండ్ల ఎపిజిపి బ్యాంకు మేనేజర్ మహేష్, జిల్లా పరిషత్ హైస్కూల్ ఇన్‌ఛార్జి రాంమోహన్‌రెడ్డి, మహాత్మా గాంధీ పాఠశాల కరస్పాండెంట్ హరికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్రంలో డిక్టేటర్ పాలన కొనసాగుతోందని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసిపి అఖండ విజయం సాధిస్తుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎంపీ, పులివెందుల మున్సిపల్ పార్టీ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వి.వరప్రసాద్, మార్కెట్ మాజీ చైర్మన్ చిన్నప్ప, మాజీ సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్లపల్లి కిషోర్, భార్గవి, మున్సిపల్ కో ఆప్షన్ నెంబర్ చంద్రమౌ పాల్గొన్నారు. **వేంపల్లె :** జగన్ పుట్టిన రోజు వేడుకలను వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆధ్వర్యంలో, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి స్వగృహంలో వేడుకలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మైనార్టీ కన్వీనర్ మునీర్ కేక్ కట్ చేశారు. బాలికల పాఠశాలలో మాజీ దేవస్థానం చైర్మన్ కుర్రాకుల వెంకటేష్, పాములూరు, తాళ్ళపల్లె, బాలుర పాఠశాలలో వేంపల్లె సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, అంగన్వాడీలో ఎంపిటిసి పద్మా రాజ్‌కుమార్ పలకలు, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి నిసార్ బాషా, వైసిపి నేతలు గోగుల కొండయ్య, కటిక చంద్రశేఖర్, గండి దేవస్థానం చైర్మన్ కృష్ణతేజ, షామీర్ పాల్గొన్నారు. **ఖాజీపేట :** జగన్ జన్మదిన కార్యక్రమాన్ని ఆర్‌వి సుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దుంపలగట్టులో నిర్వహించారు. లారెన్స్ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేశారు. వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, అగ్రహార సహకార సంఘం మాజీ అధ్యక్షులు పివి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి బి.కొత్తపల్లి నాగిరెడ్డి, సిద్ధారెడ్డి, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** జగన్ జన్మదినం సందర్భంగా వైసిపి కార్యాలయంలో మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆకుల రవికుమార్, రామాంజనేయులు, గోపాలకృష్ణ, సిద్దు, సూర్యమునిరెడ్డి పాల్గొన్నారు. **చాపాడు(మైదుకూరు) :** జగన్ జన్మదిన వేడుకలను మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వ్యవసాయ శాఖ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి, మఠం జెడ్పిటిసి రామగోవింద్‌రెడ్డి, ఎంపిపి వీరనారాయణరెడ్డి, మైదుకూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీమన్నారాయణ రెడ్డి, యువ నాయకుడు మూలే భరత్‌కుమార్ రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షరీఫ్, పట్టణాధ్యక్షుడు లింగన్న, చాపాడు ఎంపిపి లక్ష్మయ్య, సివి సుబ్బారెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ కిశోర్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. **చాపాడులో..** ఎంపిపి లక్ష్మమయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సర్పంచ్ కిషోర్‌కుమార్ రెడ్డి, సివి సుబ్బారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, శాంతరాజు, వినయ్‌కుమార్‌రెడ్డి, సురేష్ కుమార్‌రెడ్డి, జమాల్, ఎంపిటిసి శివ, మహేష్ యాదవ్ పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** బస్టాండ్ ఆవరణలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. పరిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వ్యవసాయ కమిటీ చైర్మన్ వి.రామమోహన్ రెడ్డి, మండల నాయకులు వి.రాజగోపాల్‌రెడ్డి, వి.అరవింద నాథరెడ్డి, బిఎన్.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** జగన్ పుట్టినరోజు వేడుకలను వైసిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో హృషి కేశవరెడ్డి తెప్పించిన కేక్‌ను పిఆర్‌చే కట్ చేయించారు. ఎమ్మెల్సీ పిఆర్ ఆధ్వర్యంలో 116 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, మల్కిరెడ్డి, గూడెంచెరువు నాగేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, మోహన్ రెడ్డి, యోబు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** జగన్ జన్మదిన వేడుకలను మాజీ ఎమ్మెల్యే మూలే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి తమ్మిశెట్టి బాలయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు జయరామిరెడ్డి, సాంబశివారెడ్డి, మాడిశెట్టి శివ, ఎరుకలరెడ్డి పాల్గొన్నారు. **చెన్నూరు :** జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజవర్గం ఇన్‌ఛార్జి నరేన్ రామాంజనేయులు హాజరై కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పారిశుద్ధ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ భాస్కర్ రెడ్డి, ఎంపీ చీర సురేష్ యాదవ్, ఆర్.చిన్న, మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు సొంతం నారాయణరెడ్డి, సుదర్శన్ రెడ్డి, తుంగ చంద్ర యాదవ్ నాగిరెడ్డి, గణేష్ రెడ్డి, హస్రత్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. **కడప :** జగన్ జన్మదిన వేడుకలన వైసిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు పాల్గొని పేదలకు అన్నదానం, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. తొలుత వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంలో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పులిసునీల్ కుమార్, వినోద్ కుమార్, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** జగన్ పుట్టిన రోజు సందర్భంగా కడప - రాయచోటి రింగ్ రోడ్‌లో ఉన్న వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కమలాపురం వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోచం రెడ్డి నరేన్ రామాంజనేయులరెడ్డి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు, కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ గూడా ప్రభాకర్ రెడ్డి నాయకులు గుత్తి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, గూడా రాజశేఖర్ రెడ్డి కళా యాదవ్, గజ్జల ఈశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి సుబ్బారెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బి.మనోహర్

పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ కోరారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ 2,3 నెలలుగా వేతానాలు అందక పారిశుధ్య సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంత వరకు కార్మికులకు వేతనాలు వేయకపోవడం చాలా బాధాకరమన్నారు. కాంట్రాక్టర్ వీరికి సెలవులు కూడా మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ ప్రకారం కనీస వేతనం రూ.16,000 ఇవ్వాలని తెలిపారు. కార్మికులు ఆందోళన, పోరాటం చేయడంతో రూ.12,402 చెల్లిస్తున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ శానిటేషన్ వర్కర్లతో కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు జి.ఏసుదాసు, ఉపాధ్యక్షులు వినయ్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచి నీటి సరఫరా

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

నక్కలపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద పైప్‌లైన్ లీకేజీ పనులు పూర్తి కావడంతో ఆదివారం నుంచి యథావిధిగా పట్టణంలో నీటి సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ డి.రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. లీకేజి పనులను పూర్తి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. అభినందించిన వారిలో మున్సిపల్ డిఇ చిదానం దరెడ్డి, నీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల జయకేతనం

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు జయకేతనం ఎగుర వేసినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. శనివారం క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఈ క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఖోఖోలో జూనియర్ బాలుర విభాగంలో మొదటి బహుమతిని గెలుచుకొన్నట్లు చెప్పారు. సీనియర్ విభాగంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో రెండవ బహుమతిని సాధించి తమ క్రీడా నైపుణ్యాన్ని చాటుకున్నారని తెలిపారు.

డప్పు వాయిద్యాలు వితరణ

ప్రజాశక్తి-ముద్దనూరు

మండల కేంద్రంలోని దళితవాడలో డప్పు కళాకారులకు శనివారం మండల నాయకులు కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుమారుడు యువ నాయ కులు కటికరెడ్డి గుణవంతరెడ్డి రూ.20వేలు విలువ చెసే డప్పులు వితరణ చేశారు. తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి డప్పులు అందజేశారు. విఆర్‌ఒ రాజ శేఖర్ నాయుడు, నాయకులు రామాం జనేయరెడ్డి, కమలాకర్‌రెడ్డి, విజయ్, వినోద్, ఓబులేసు, దానం, రాజశేఖర్, టోని, శివమణి, అభి పాల్గొన్నారు.

నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకల్లో నాయకులు

ప్రజాశక్తి-వేముల

వేముల మెయిన్ రోడ్డులో శనివారం నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలను ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థ సారధిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్ర నాథ్‌రెడ్డి, పేర్ల శేషారెడ్డి, టిడిపి నాయ కులు, కార్య కర్తల ఆధ్వర్యంలో నిర్వ హించారు. కేక్ కట్ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి బోయిన బ్రహ్మయ్య, నాయుని చెరువు చైర్మన్ కూనపూరి రాములు, అలవలపాడు బాలస్వామి రెడ్డి, రామిరెడ్డిపల్లె జగన్మోహన్‌రెడ్డి, గొందిపల్లె ఆసం విశ్వేశ్వర్‌రెడ్డి, జడ్‌వి హెచ్ఎస్ స్కూల్ కమిటీ చైర్మన్ వల్లెపు వెంకటేష్, వేల్పుల రాగిపిండి సుధాకర్ రెడ్డి, వేముల ధనుంజయ, శివ, చాగలేరు రామచంద్ర, దుగ్గన్నగారిపల్లె వసంత, గంగాధర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలోని కందిమల్లయ్య పల్లె జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ విద్యార్థులు శనివారం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శిం చారు. 9వ తరగతి నుండి ఇంటర్ చదివే విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, లోకే షన్ ఇన్‌స్పెక్టర్, ఉపాధ్యాయులు విజిట్ చేశారు. అక్కడ ఉన్న ఎఇ, విద్యుత్ సిబ్బంది సబ్‌స్టేషన్ పనితీరు, విద్యుత్ పొదుపు, ప్రమాదాలు వాటి నివారణ చర్యలుపై విద్యార్థులకు వివరించారు.

కూటమి పాలనలో రాష్ట్రం అప్పుల కుప్ప : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అప్పుల విషయంలో కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డ నాకినట్లుంది చంద్రబాబు పాలనా తీరు అని విమర్శించారు. వైసిపి పాలనలో రాష్ట్రం అప్పుల కుప్ప అయిందని చెప్పారని గుర్తు చేశారు. వైసిపి అధికారం కోల్పోయే నాటికి రాష్ట్ర అప్పు దాదాపు రూ.10 లక్షల కోట్లు అన్నారు. వైసిపి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని టిడిపితో సహా అన్ని పార్టీలు గతంలో విమర్శించాయని తెలిపారు. నేడు టిడిపి కూటమి ప్రభుత్వం అదే పని చేస్తోందని, అంతకంటే ఎక్కువ అప్పులను చేస్తున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి 7 నెలల్లోనే కూటమి ప్రభుత్వం రూ.59 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.91,443 కోట్ల అప్పు చేస్తామని బడ్జెట్‌లోనే పేర్కొందని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం కేంద్రం నుండి నిధులు తెప్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, వెంకటేష్, బద్రి, రాజు, రవి, వినయ్ పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి ఉపాధి చూపించాలి

కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి బాలం సుబ్బరాయుడు కోరారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ పార్లమెంటు సమావేశాల్లో రాష్ట్ర ఎంపీలు కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు తమ వాణి వినిపించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతం కరువు, వలసలు, రైతుల ఆత్మహత్యలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రాంతంలోని జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

కెసి కెనాల్ రైతుల సమస్యల్ని పరిష్కరించాలి

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

కొత్తగా ఎన్నికైన కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ రైతుల సమస్యల్ని పరిష్కరించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి కోరారు. శనివారం కెసి కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం జలవనరుల శాఖ సాగునీటి వినియోగదారుల ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక నంద్యాల కెసి కెనాల్ కార్యాలయంలో 14 మంది డిస్ట్రిబ్యూటరీ చైర్మన్లు కలిసి కెసి కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులుగా బన్నూరు రామలింగారెడ్డి, ఉపాధ్యక్షులుగా ద్వార్శల గురివిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నంది కొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, ప్రొద్దుటూరు నియోజక వర్గ కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, అధికారులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బందికి దుస్తులు అందజేత

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న సిబ్బందికి కటాక్షమ్మ ఫార్చ్యూన్ సొసైటీ నుంచి దుస్తులను పంపిణీ చేయడం ఆనందంగా ఉందని ఆ సొసైటీ డైరెక్టర్, ప్రభుత్వ వైద్యశాల ఐసిడిఎస్ అధికారి ప్రతాప్ కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫిక్ పాషాచే శనివారం ప్రతాప్ కుమార్ దుస్తులను పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా రఫిక్ పాషా మాట్లాడుతూ సొసైటీని అభినందించారు. సమాజ సేవలో ఈ రకంగా ముందుకు రావడం ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు, తమ సోదరుడు విపర్తి ప్రేమ్‌కుమార్ నేర్పిన సంస్కారమన్నారు. తమ వంతు సొసైటీ తరుపున సేవ చేస్తూనే ఉంటానని తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



మండల పరిధి తుమ్మలపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాగిమానిపల్లి సర్పంచ్ గజ్జల అనూష మహేశ్వర్‌రెడ్డి విద్యార్థులకు విద్యా సామగ్రి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రతి ఏటా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఏదో ఒక సేవా కార్యక్రమాలు చేస్తూ ఉంటామన్నారు. ఈ ఏడాది విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశామన్నారు. గ్రామంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హేమంత్ రెడ్డి, రామాంజనేయ రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.